


# జనమేజయోపాఖ్యానం

వేలేటి
రామచంద్రారావు

**అది హేమంత ఋతువు.**

బాలభానుని లేత కిరణాలు సుందరమైన ఆ భవంతికి బంగారు పూత పూస్తున్నాయి. భవంతి నానుకొని ఉన్న ఉద్యానవనంలో సుమనోహర సుగంధ పరిమళాలు వెదజల్లుతూ. పూలమొక్కలు నాట్యం చేస్తున్నాయి. అప్పటివరకు హేమంత సీమంతినీ ప్రగాఢ పరిష్వంగంలో నున్న పక్షిగణములు బాల భాస్కరుని పసిడి కిరణాలు సోకగానే రెక్కలు రెపరెపలాడిస్తూ కిలకిలారావాలు చేస్తున్నాయి.

అంతఃపుర గవాక్షంనుండి ప్రకృతి సౌందర్యాన్ని వీక్షిస్తున్న జనమేజయ మహారాజు "ప్రభూ" అన్న పిలుపుకి వెనుదిరిగి చూశాడు.

"వైశంపాయనులవారు వేంచేస్తున్నారు, ప్రభూ!" సవినయంగా అంది పరిచారిక.

జనమేజయుని భృకుటి క్షణకాలం ముడుచుకొంది. ఇంత ప్రొద్దున్నే గురుదేవుల రాకకు కారణమేమై ఉంటుందని ఆలోచిస్తూ స్వాగతం చెప్పడానికి ఎదురుగా వెళ్ళాడు.

"గురుదేవులకు అభివాదనం. మీ రాకతో మా గృహం పావనమయింది. ఈ ఆసన మలంకరించండి" అంటూ వినయ విధేయతలతో ఆహ్వానించాడు జనమేజయుడు.

వైశంపాయనుడు మంద స్మిత వదనంతో "దీర్ఘాయుష్మాన్‌భవ!" అంటూ ఆశీర్వదించి ఆసన మలంకరించాడు.

"జనమేజయా! నేను తపస్సు చేసుకొనుటకై వింధ్యారణ్య ప్రాంతముల కేగుచున్నాను. తిరిగి రావడానికి రెండు వర్షములు పట్టవచ్చును. వెళ్ళేముందు ఒకసారి నీ యోగక్షేమములు విచారించి వెళ్ళవలెననే కోరికతో నీ వద్దకు వచ్చాను" అన్నాడు వైశంపాయనుడు.

"చాలా సంతోషం, గురుదేవా! మీ కృపా కటాక్ష వీక్షణములు మాపై ఉన్నంతవరకు మాకు, మా రాజ్యానికి ఎలాంటి ఆపద సంభవించదు." వినయంతో అన్నాడు జనమేజయుడు.

"అదంతా నీకు నాపైగల భక్తి ప్రపత్తులే, నాయనా! మీ పూర్వీకుల గుణగుణాలను పుణికి పుచ్చుకొన్నావు...సరే, జనమేజయా! నాకు కాలాతీత మవుతుంది. వెళ్ళేముందు ఒక్క మాట...నీ పాలనలో అన్యాయం, అధర్మం, అవినీతి, అక్రమం అనేవి మచ్చుకైనా కానరాకూడదు. మీ తాతలు పాండుభూపాల తనయులు ఎన్నడూ ధర్మమార్గాన్ని తప్పి చరించలేదు. మీ తండ్రి పరీక్షిత్తు మహారాజుకూడా వారి మార్గా న్ననుసరించే రాజ్య పరిపాలన చేశాడు. వారు ఆర్జించిన కీర్తికి నీవు మచ్చ తేకూడదు. మీ తాతలవలె ధర్మనిరతుడవై, అజేయ బలపరాక్రమ సంపన్నుడవై, యశఃకాముడవై ప్రజలను కన్న బిడ్డలవలె పరిపాలించు" అన్నాడు వైశంపాయనుడు.

ఆ మాటలకు జనమేజయుని ముఖం చిన్నబోయింది. ఆవేశం కట్టలు తెంచుకొని

రాబోయింది. అయినా దాన్ని పైకి కనబరచకుండా, "గురుదేవా! గతంలోకూడా మీ రిలాగే నాముందు మాతాతల ప్రసక్తి తెచ్చి వారిని ధర్మ స్వరూపులుగా, మహా శౌర్య బలసంపన్నులుగా వర్ణించారు. అయినా మీ మీదగల గౌరవంతో సహించాను. నాకు తెలియక అడుగుతాను...దేశం గొడ్డు పోయినట్లు ఒక స్త్రీని అయిదుగురు కట్టుకొని కులికినందులకా వారు ధర్మ స్వరూపులు? లేక జూదంలో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో కానల కేగినందులకా? చెప్పండి, గురుదేవా! ఎందులకు?...అంతేగాక వారిని మహావీరులని పొగడుతున్నారు. ఎందులకు?...నిండు సభలో మా అమ్మమ్మను అవమానించినప్పుడు అవనత శిరస్కులైనందులకా? లేక అయిదుగురికి అయిదూళ్ళిచ్చిన చాలునని అంజలి ఘటించి అర్థించినందులకా? ఎందులకు, గురుదేవా! ఆత్మగౌరవాన్ని చంపుకొన్నవారి అడుగు జాడలలో నన్నేల నడువుమందురు?...దయ ఉంచి ఇకపై వారి ప్రసక్తి నాముందు తేవలదు" అన్నాడు జనమేజయుడు.

జనమేజయుడు అలా మాట్లాడుతాడని కలలోకూడా ఊహించని వైశంపాయనుడు ఖిన్నుడైపోయాడు. అయినా శాంత గంభీర స్వరంతో "నాయనా, జనమేజయా! కాలం ఎప్పుడూ మనది కాదు. పురాకృత కర్మ ఫలితాన్ని ఎంతటివారైనా అనుభవింపక తప్పదు. దైవోపహతులకు ఆపదలు వెన్నంటే ఉంటయి. మీ తాతలు అంతే, నాయనా!" అన్నాడు.

"గురుదేవా! మీ కర్మ సిద్ధాంతాన్ని వినడానికి నా కిప్పుడు ఓపిక లేదు. అంతేగాక, కానున్నది కాక మానదని కార్యవిముఖులు కావడం కాపురుష లక్షణం. నేను మహారాజును. ఈ క్షణాన దరిద్రుడిని శ్రీమంతుడిగా, ఆగర్భ శ్రీమంతుడిని నిరుపేదగా, అల్పుడిని అధికారిగా, అధికారిని అనామకుడిగా మార్చివేయగల సమర్థుడను. సర్వమూ మన చేతిలో ఉంచుకొని, అసమర్థునివలె పురాకృత కర్మ ఫలమని సరిపెట్టుకొని ఆత్మవంచన చేసుకోలేను." ఆవేశంగా అన్నాడు జనమేజయుడు.

వైశంపాయనుడు సాలోచనగా రెండు కళ్ళు మూసుకొని, తల పంకించి, చిరునవ్వుతో జనమేజయునివంక చూస్తూ, "నాయనా, జనమేజయా! నీతో వాగ్యుద్ధం చేయడానికి రాలేదు నేను. పెద్దల మాటలను గౌరవిస్తావనే నమ్మకంతో నీకు గురువునైనందులకు తోచిన హితోపదేశం చేయబోయాను. ఇంతమాత్రానికే నీవు ఆవేశపడవలసిన అవసరం లేదు. కాని...జనమేజయా! ఒక్క మాట మాత్రం జ్ఞాపకముంచుకో. ఈనాడు నీ వొక మహారాజువి. అందుకే నీవు కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించలేక పోతున్నావు...అందుకు నే నేమీ బాధ పడడంలేదు...ని భవిష్యత్తును గూర్చి రెండు మాటలు చెవుతాను. శ్రద్ధగా ఆలకించు. వచ్చే వైశాఖ పూర్ణిమ రోజున నీవు ఒక పంచకళ్యాణి గుర్రాన్ని కొంటావు. దా న్నధిరోహించగానే అది ఒక సుందర ప్రదేశానికి తీసుకెళుతుంది. అక్కడ నీ వొక గంధర్వ కన్యను చూసి మోహించి, పెళ్ళి చేసుకొమ్మని ప్రాధేయపడతావు. అందులకు ఆ సుందరి అశ్వమేధ యాగాన్ని నిర్విఘ్నంగా ఒనర్చినచో వరిణయమాడెద నంటుంది. అందుకు నీవు సమ్మతించి, ఆ సుందరితో సహా రాజధానికి విచ్చేసి అశ్వమేధ యాగాన్ని ప్రారంభిస్తావు. కాని, ఋత్విక్కుల అపస్వర మంత్రోచ్చాటనవల్ల అగ్ని దేవుడు ఆగ్రహించి యజ్ఞశాలను భస్మం చేస్తాడు. యజ్ఞానికి విఘ్నం కలుగగానే ఆ గంధర్వ కన్య తన లోకం వెళ్ళిపోతుంది. దాంతో నీకు మతి చలించి, పదహారుమంది ఋత్విక్కుల ప్రాణాలను తీస్తావు. బ్రహ్మహత్యా పాతకంవల్ల నీకు కుష్ఠు వ్యాధి వస్తుంది. ఆ వ్యాధి నయంకావడానికి నీ సిరిసంపదలు, భోగభాగ్యాలు, అధికారం ఎందుకూ కొరగాకుండా పోతాయి. అప్పుడు నీ వెంత పశ్చాత్తాపపడినా ఫలిత ముండదు" అన్నాడు వైశంపాయనుడు.

గురుదేవుల మాటలకు జనమేజయుడు పెద్దగా నవ్వుతూ—

"ఆవండి, గురుదేవా! ఇక వినలేను...నే నేమిటి...గంధర్వ స్త్రీని ప్రేమించడ మేమిటి? బ్రాహ్మణులను వధించడ మేమిటి?...నాకు కుష్ఠురోగం రావడ మేమిటి?...భలే చక్కని కథ అల్లారు, గురుదేవా!...ఈ కథ చెప్పి నన్ను భయపెట్టదలచినారా?...అయినా ఇదంతా జరుగుతుందనే అనుకొంటున్నారా? అసంభవం, గురుదేవా! నా గురించి మీరేమీ చింతించవద్దు. ఇంతకూ నేను పంచకళ్యాణి గుర్రాన్ని కొంటేనే గదా ఇదంతా జరిగేది. దానిని కొనకుండా ఉంటే సరి. మీరు నిశ్చింతగా తపోవనానికి వెళ్ళిరండి" అన్నాడు.

వైశంపాయనుడు జనమేజయుని కళ్ళలోకి వాత్సల్యంగా చూస్తూ, మౌనంగా చేయెత్తి ఆశీర్వదించి, భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ అంతఃపురంనుండి వెళ్ళిపోయడు.

×× ×× ××

కాలమే అన్నిటినీ మరిపిస్తుంది. ఆ శక్తే గనక కాలానికి లేకపోతే మానవుడు ప్రతి రోజూ చచ్చిన వారికోసం ఏడుస్తూ కూర్చొనేవాడేమో!


కాలచక్ర పరిభ్రమణంలో రోజులూ, నెలలూ గడిచిపోతున్నాయి. వసంత ఋతువు ప్రవేశించింది. ప్రకృతి పరవశించిపోతూంది.

జనమేజయుడు కొలువుదీరి ఉన్నాడు. పౌరులు తమ కష్టాలను విన్నవించుకొంటున్నారు.

"ధర్మ ప్రభువులు రక్షించాలి. వన్యమృగాల బెడదవల్ల మా పైరులకు, పశువులకు రక్షణ లేకుండా పోయింది. తమరే మమ్మల్ని కాపాడాలి" అంటూ దీనంగా ప్రాధేయపడుతున్నా డొక పౌరుడు.

జనమేజయుడు వారి మాటల నాలకించి "పౌరులారా! మీరు నిశ్చింతగా వెళ్ళిరండి. నేను రేపే వేటకు బయలుదేరి వెళ్ళి వన్యమృగాలను సంహరించి, మీ కష్టాలను దూరం చేస్తాను" అని మహామంత్రివైపు తిరిగి "మహామంత్రీ! వెంటనే వేటకు వెళ్ళే ఏర్పాట్లు చేయించండి" అన్నాడు.

మహామంత్రి చేతులు కట్టుకొని సవినయంగా "మహారాజా! తమ రథిరోహించే అశ్వం మొన్ననే ఏదో విచిత్రమైన రుగ్మతకు లోనై అసువులు కోల్పోయిన విషయం మీకు తెలును గదా! మన అశ్వశాలలో తమ రథిరోహించదగిన అశ్వం ఒక్కటిగూడా లేదు, ప్రభూ!" అన్నాడు.



జనమేజయుడు రెండు క్షణాలు ఆలోచించి—

"మహామంత్రీ! వెంటనే ఒక ఉత్తమాశ్వాన్ని కొనితెప్పించండి. వేటకై తగిన ఏర్పాట్లు చేయించండి!" అని ఆజ్ఞాపించి కొలువు చాలించి లేచి అంతఃపురంవైపు వెళ్ళిపోయాడు.

'రాజు తలుచుకొంటే దెబ్బలకు కొదువా' అన్నట్లు సలక్షణమైన గుర్రాన్ని కొనితెచ్చుటకు దేశం నలుమూలలకు పరివారం పరుగుతీశారు. తెల్లవారేసరికి నిగనిగా మెరిసిపోతున్న పంచకళ్యాణి గుర్రాన్ని తీసుకువచ్చారు. జనమేజయుడు ఆ అశ్వాన్ని చూసి మహానందపడ్డాడు. మందీ మార్బలంతో ద్విగుణీకృత ఉత్సాహంతో వేటకై బయలుదేరాడు జనమేజయుడు.

అంతవరకు కదిలితే కందిపోతుందేమోనన్నంత మెల్లగా నడుస్తున్న ఆ పంచకళ్యాణి పరుగెత్తడం ప్రారంభించింది. పరివారం దానివెంట ఎంత వేగంగా పరుగెత్తినా దాన్నందుకోలేక పోతున్నారు. కొండలూ కోనలూ దాటి, అనేక మలుపులు తిరుగుతూ సాయంకాల సమయానికి ఒక ఉద్యానవన సమీపానికి చేరుకుంది పంచకళ్యాణి. జనమేజయుడు మెల్లగా అశ్వాన్ని దిగి, వెనక్కి తిరిగి చూశాడు. కనుచూపుమేరలో మానవమాత్రు లెవరూ గోచరించడం లేదు. నోరు పిడచగట్టుకొని పోతూంది. మంచినీళ్ళకై నలువైపులా దృష్టిని సారించాడు. అల్లంత దూరంలో ఒక కుసుమకోమలి తన కోమలమైన వ్రేళ్ళతో పూలు కోస్తూ కనిపించింది. జనమేజయుడు మెల్లగా ఆమెను సమీపించి—

"సుందరీ, నీ వెవ్వరవు? ఈ నిర్జనోద్యానవనంలో ఒంటరిగా సంచరించుటకు హేతువేమి?" అన్నాడు.

నవమన్మథాకారుడైన పురుషుడు తనను పలుకరిస్తున్నాడని తెలియగానే ఆ సుందరి సిగ్గుతో తల వంచుకొని, చిరునవ్వు చిందిస్తూ, క్రీగంట జనమేజయుని వీక్షిస్తూ—

"నేను గంధర్వ రాజైన చిత్రరథుని కుమార్తెను. నా పేరు చిత్రలేఖ అంటారు. నారద మహర్షి శాపంవల్ల ఈ భూలోకానికి రావలసి వచ్చింది. ఈ ఉద్యానవనంలోని సుగంధ సుమనోహర పరిమళములు వెదజల్లే సుమాలను చూడగానే కోసుకోవా లనిపించింది" అన్నది.

"అలాగా...నా ఊహ నిజమైనది. నిన్ను చూడగానే శాపగ్రస్తురాలవైన దేవకాంతవని ముందే అనుకొన్నాను. చాలా సంతోషం...అన్నట్లు చెప్పడం మరిచాను. నేను హస్తినాపురాధీశ్వరుడను. పేరు జనమేజయుడు" అని తన్ను తాను పరిచయం చేసుకున్నాడు జనమేజయుడు.

చిత్రలేఖ సిగ్గుతో కుంచించుకుపోయింది.




జనమేజయుడు చిత్రలేఖకు మరింత దగ్గరగా జరిగి, "సుందరీ! నీవంటి సౌందర్యరాశిని నే నింతవరకు ఎక్కడా చూడలేదు. నీ అందానికి నేను ముగ్ధుడ నయ్యాను. దయ ఉంచి నన్ను పరిణయమాడవలసిందిగా ప్రాధేయపడుతున్నాను" అన్నాడు.

చిత్రలేఖ చివుక్కున తలెత్తి చూసి, "మహారాజా! మిమ్ములను పరిణయమాడుటకు నా కభ్యంతర మేమియు లేదు. కాని, నా క్కాబోయే భర్త అశ్వమేధ యాగ మొనరించిన వాడై ఉండాలన్నదే నా అభిలాష" అన్నది సిగ్గుపడుతూ.

"అదెంత సేపు, సుందరీ! మనం హస్తినాపురం చేరుకొనిన వెంటనే అశ్వమేధ యాగానికి కావలసిన ఏర్పాట్లు చేయిస్తాను. నీ కన్నులముందే మహా వైభవోపేతంగా అశ్వమేధ క్రతు వొనర్చి, నీ అభీష్టాన్ని నెరవేరుస్తాను. సంశయించకు, సుందరీ! నా మాట నమ్ము" అంటూ చిత్రలేఖ దక్షిణ హస్తాన్నందుకొని అరచేతిలో మెల్లగా గిల్లాడు జనమేజయుడు.

చిత్రలేఖ తన చేతిని మెల్లగా విడిపించుకొని "ధన్యురాలను, ప్రభూ!" అంటూ వంగి జనమేజయుని పాదాలకు నమస్కరించబోయింది. వెంటనే జనమేజయుడు తన రెండు చేతులతో చిత్రలేఖను లేవనెత్తి, తన బాహు యుగంతో బంధించాడు.

ఘడియలు క్షణాలుగా గడిచిపోతున్నాయి.

సూర్యభగవానుడు పశ్చిమాద్రిని చేరుకొన్నాడు. పక్షులు కిలకిలారావాలు చేస్తూ గూళ్ళకు చేరుకుంటున్నాయి.

చిత్రలేఖా జనమేజయులు పంచకళ్యాణిని అధిరోహించారు. అది హస్తినాపురంవైపు పరుగు తీసింది.

×× ×× ××

అది ప్రభాత సమయం.

మంగళతూర్యారావాలు మారు మ్రోగుతున్నాయి.

సామంత, దండనాయక పరివారములతో బాటు, అశ్వమేధ యాగాన్ని చూడవచ్చిన జనసమూహంతో హస్తినాపురం కళకళలాడుతున్నది. యాగశాల చుట్టూ పచ్చటి పందిళ్ళు వేశారు. వాటిని తోరణాలతో అలంకరించారు. మధ్యలో అందరికి కనిపించేందుకు వీలుగా ఎత్తయిన హోమకుండాన్ని నిర్మించారు. దాన్ని ఆవుపేడతో అలికి, రంగు రంగుల రంగవల్లికలతో అలంకరించారు.

క్రతుదీక్షాపరుడైన జనమేజయ మహారాజు పట్టు పుట్టములు ధరించి, హోమ కుండంముందు పూర్వాభిముఖుడై కూర్చున్నాడు. ఆయనకు వామభాగాన పట్టమహిషి సులక్షణాదేవి కూర్చొనుంది. వారికి అల్లంత దూరంలో చిత్రలేఖ ఆసీనురాలయింది. యాగశాల పురప్రముఖులతో, ఆస్థాన విద్వాంసులతో, భూసురోత్తములతో కిటకిటలాడుతూంది. హోమకుండం చుట్టూ పదహారు మంది ఋత్విక్కులు వేద మంత్రోచ్చాటన గావిస్తున్నారు. యాగ పర్యవేక్షకులైన 'సోమయాజి', అతని ధర్మపత్ని 'సోమిదేవమ్మ' యాగ నిర్వహణ కార్యక్రమంలో నిమగ్నులై ఉన్నారు.

ఋత్విక్కులు వేద మంత్రాలను సుస్వరంతో వల్లిస్తున్నారు. యాగకుండంలో అగ్ని ప్రజ్వరిల్లింది. ఋత్వికులు 'స్వాహా' అని అన్నప్పుడల్లా జనమేజయుడు 'సృక్‌స్రువాల'తో ఆజ్యం పోస్తున్నాడు హోమకుండంలో.

ఇంతలో సవనాశ్వాన్ని తీసుకువచ్చారు. దానిని పంచామృతాలతో అభిషేకించారు. ఋత్విక్కులు మంత్రాలను సుస్వరంతో పఠిస్తున్నారు. ఋత్విక్కులే కాకుండా 'సోమయాజి', 'సోమిదేవమ్మ'లు కూడా వింశతి పంచ వింశతి వర్ష వయస్కులు కావడం ఈ యాగంలోని విశేషం.

సోమిదేవమ్మ సవనాశ్వానికి ఆపాదమస్తకం సుగంధద్రవ్యాలను పూస్తూంది. గుర్రం పాదాలకు పసుపు రాస్తుండగా తొందరలో ఆమె పైట జారిపోయింది. యౌవన దశలోనున్న ఆమె వక్షోజాలు ప్రాంకంగా కనిపిస్తున్నాయి. అప్పుడే యౌవన ప్రాంగణంలోకి అడుగిడుతున్న ఋత్విక్కుల కళ్ళు ఆమె స్తనద్వయాలవైపు మళ్ళాయి. వారిలో ఏదో తెలియని ఉద్రేకం కలుగసాగింది. శరీరంలోని నరాలు జివ్వున లాగసాగాయి. వారి వేద మంత్రోచ్చాటనలో అపస్వరం ధ్వనించింది. సోమయాజి నివ్వెరపోయాడు. అపస్వర మంత్రాలకు ఆగ్రహించి అగ్నిభట్టారకుడు భగ్గున మండి, తన భీషణ జ్వాలలతో యాగశాలను దగ్ధం చేస్తున్నాడు.

హాహాకారాలు మిన్నుముట్టాయి. ప్రాణభయంతో ఎవరికి తోచిన దిక్కు వారు పారిపోతున్నారు. సవనాశ్వము బెదరి పరుగు లంఘించుకొంది. జరిగిం దేమిటో తెలియక

జనమేజయుడు విస్తుపోతున్నాడు.

ఇంతలో ఆకాశం వైపునుండి మాటలు విన్పిస్తున్నాయి. జనమేజయుడు తలెత్తి చూశాడు.

"జనమేజయ మహారాజా! ఆడిన మాట ప్రకారం నీవు అశ్వమేధ యాగాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చలేకపోయావు. అయితే యజ్ఞదీక్షలోనున్న నిన్ను, నీ ధర్మపత్నిని వీక్షించగానే నాకు శాపవిమోచనమయింది. నేను మాలోకానికి వెళ్ళి పోతున్నాను" అంటూ చిత్రలేఖ గగన మార్గాన వెళ్ళిపోయింది.

జనమేజయునికి పిచ్చెక్కినట్లయింది. 'సోమయాజి'ని సమీపించి,

"భూసురోత్తమా! యజ్ఞం ఇలా విఘ్నం కావడానికి కారణమేమై ఉంటుంది? నిజం చెప్పండి. మీకేం భయంలేదు" అన్నాడు జనమేజయుడు.

'సోమయాజి' నిజం చెప్పడానికి సంశయించాడు. అది గ్రహించిన జనమేజయుడు ప్రక్కనే ఉన్న సైన్యాధిపతి ఒరలో నుండి ఖడ్గాన్ని లాక్కొని

"ఇప్పటికైనా నిజం చెప్పండి. లేనిచో మీ శిరస్సు ఒక్క వ్రేటుతో తెగి క్రిందపడుతుంది" అని ఖడ్గాన్ని ఝుళిపించాడు.


సోమయాజి భయపడుతూ, "ప్రభూ! క్షమించండి...జరుగరాని మహాపరాధం జరిగిపోయింది. ఈ ఋత్విక్కుల అపస్వర మంత్రోచ్చాటనే యాగ విఘ్నానికి కారణం" అన్నాడు.

వెంటనే జనమేజయుడు దక్షయజ్ఞ ధ్వంసకుడైన పరమశివునివలె అపర రుద్రుడై పదహారు మంది ఋత్విక్కుల కుత్తుకలను ఖండించాడు. హోమకుండం నెత్తురుతో నిండిపోయింది. దూరంగా నిలబడి ఆ దృశ్యాన్ని వీక్షిస్తున్న సామంత, దండనాయకులు మహారాజుకు పిచ్చిపట్టినదని, ఇంకా స్సేపు అలాగే ఉంటే తమ ప్రాణాలకు కూడా ముప్పురావచ్చుననే భయంతో యాగశాలను విడిచి వెళ్ళిపోయారు.

చుట్టూ కలయజూశాడు జనమేజయుడు. నిర్మానుష్యమై, భయంకర నిశ్శబ్ద మావరించింది ఆ ప్రదేశమంతా. రక్తపు మడుగులో మునిగి ఉన్న ఋత్విక్కుల శవాలవంక చూస్తూ, వికటాట్టహాసం చేస్తూ, కుప్పగా కూలిపోయాడు. కాళ్ళు, చేతులు వంకర్లు తిరిగి, నేలమీద పడి గిలగిలా తన్నుకొంటున్నాడు జనమేజయుడు.

×× ×× ××

అంతఃపురంలో హంసతూలికా తల్పంమీద బాధ భరించలేక మూల్గుతూ అటూ ఇటూ దొర్లుతున్నాడు జనమేజయుడు. అతని మస్తిష్కంలో రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. ఉన్నట్టుండి గతం జ్ఞాపకమొచ్చింది. తనలో తానే గొణుక్కుంటున్నాడు.




'గురుదేవులు అన్నదంతా అక్షరాలా జరిగింది. ఈ చరా చర ప్రపంచమంతా భగవన్నిర్ణయానుసారమే నడుస్తుందని తెలుసుకోలేని అజ్ఞానిని. మహారాజుననే అహంకారమే నన్నీ స్థితికి తీసుకువచ్చింది...' పరిపరి విధాలా పశ్చాత్తాపపడుతున్నాడు జనమేజయుడు.

ఇంతలో పరిచారిక ప్రవేశించి, "ప్రభూ! వైశంపాయనులవారు వేంచేస్తున్నారు" అంది సవినయంగా.

జనమేజయుని కళ్ళు మిలమిలా మెరిశాయి. లేచి కూర్చోబోయాడు. సాధ్యం కాలేదు. కళ్ళు మాత్రం ద్వారం వైపే చూస్తున్నాయి.

వైశంపాయనుడు లోనికి ప్రవేశించి, ప్రక్కనే ఉన్న ఆసనంపై కూర్చొన్నాడు.

"గురుదేవా! అభివాదనము. లేచి నమస్కరించలేని అశక్తుణ్ణి. మీ రన్నంత పని జరిగింది. నాకు జ్ఞానోదయమయింది. ఈ బాధ భరించలేకుండా ఉన్నాను. భయంకరమైన ఈ కుష్ఠువ్యాధిని పోగొట్టే ఉపాయాన్ని తమరే సెలవీయాలి" అంటూ ప్రాధేయపడ్డాడు జనమేజయుడు.

వైశంపాయనుడు జనమేజయుణ్ణి పరీక్షగా చూశాడు.

గోధుమవర్ణం మేనిరంగుతో, ఆరడుగుల అజానుబాహుడు, ముఖానికి అందాన్నిచ్చే ఉంగరాలు తిరిగిన ఒత్తయిన జుత్తు, తీర్చిన కనుబొమ్మలు, కోరమీసాలు, ఎప్పుడూ దరహాసాన్ని చిందించే పెదవులు, తీక్షమైన కళ్ళు, కొనదేలిన నాసిక, శాంత గంభీరుడైన ఆనాటి జనమేజయునకు, ఈయనకు పోలిక ఏమాత్రంలేదు.

జనమేజయుని ఆకృతి, అవస్థ చూసి జాలి కలిగింది వైశంపాయనునకు.

"మహారాజా! ఇందులో నీ దోషమేమీ లేదు. ఇది నీ పురాకృత కర్మఫలము. ఎంతటి వారికైనా అనుభవించక తప్పదు. నీకు తగిలిన బ్రహ్మాహత్యా పాతకము తొలిగితే గాని, ఈ కుష్ఠువ్యాధి నయంకాదు" అన్నాడు.

"చెప్పండి, గురుదేవా! అందుకు నన్నేమి చేయమందురు? బ్రహ్మాహత్యా దోష నివారణార్థమై నా సర్వంసహా సామ్రాజ్యాన్ని సైతం ధారపోయుటకు "సిద్ధంగా ఉన్నాను" అన్నాడు ఆత్రతగా జనమేజయుడు.

"అంతపని అవసరంలేదు, మహారాజా! ఏ తాతలనైతే నీవు అవివేకంతో తూలనాడావో, ఆ తాతల చరిత్రనే ఆసాంతం నీవు వినాలి. అప్పుడు గాని బ్రహ్మాహత్యా పాతకం ఉపశమించి, ఈ వ్యాధి నయం కాదు" అన్నాడు వైశంపాయనుడు.

ఆ మాటలకు జనమేజయుడు ఆశ్చర్యపోయాడు.

"నిజమా, గురుదేవా! మా తాతల చరిత్ర ఇంతటి పవిత్రమైనదా? దానిలో ఇంతటి మాహాత్మ్యముందా?" అన్నాడు.

"అవును, నాయనా! పవిత్రమైనదే. అందుకే మీ తాతల చరిత్ర భావితరాల వారికి పంచమవేద మవుతుంది. మహాభారతమను పేర జగద్విఖ్యాతమవుతుంది" అన్నాడు వైశంపాయనుడు.

"గురుదేవా! ఆలస్యమెందులకు? ఈరోజే మహాభారత కథ చెప్పడం ప్రారంభించండి. భక్తిశ్రద్ధలతో విని తరిస్తాను" అన్నాడు జనమేజయుడు ఆత్రతగా.

"జనమేజయా! మహాభారత కథ చెప్పేముందు కొన్ని ఏర్పాట్లు చేయవలసి ఉన్నది. శ్రద్ధగా విను...తెల్లని వస్త్రానికి 'జీడి' మరక ఎలాంటిదో, శరీరానికి అంటిన కుష్ఠురోగం అలాంటిది. అందుకొరకు పదునెనిమిది తెల్లని వస్త్రాలను తెప్పించి, వాటిని జీడిలో (జీడి నల్లగా ఉంటుంది. బట్ట చిరిగినా రంగు మాత్రం పోదు) వేసి ఆరబెట్టించు. ప్రతి రోజు ఒక వస్త్రాన్ని తెరగా మనిద్దరి మధ్య కట్టించు. రోజు కొక పర్వం చొప్పున పద్దెనిమిది రోజులలో మహాభారతాన్ని విన్పిస్తాను. సావధాన చిత్తుడవై విను. మధ్యలో ఏమైనా సంశయాలు కలిగితే వెంటనే అడుగు. లేనిచో అడ్డంగా కట్టిన వస్త్రం తెల్లబడదు. నీ వ్యాధి నయం కాదు. కనుక, నీ కెలాంటి సంశయం కలిగినా నిర్మోహమాటంగా అడుగుతూ ఉండు" అన్నాడు వైశంపాయనుడు.

"అలాగే, గురుదేవా" అన్నాడు జనమేజయుడు.

"నాయనా! నాకు అనుష్ఠానానికి వేళయింది. వెళ్ళొస్తాను" అంటూ వైశంపాయనుడు వెళ్ళిపోయాడు.

×× ×× ××

ఆ రోజు మాఘ శుద్ధ పంచమి (వసంత పంచమి) హరివాసరము. వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కథను విన్పించటం ప్రారంభించాడు.

ఆదిపర్వం పూర్తయిన వెంటనే అడ్డంగా కట్టిన నల్లని తెర తెల్లబడింది. జనమేజయుడు మెల్లగా లేచి, దిండునానుకొని కూర్చొనగ

లుగుతున్నాడు. రోజు కొక పర్వము చొప్పున విన్పిస్తున్నాడు వైశంపాయనుడు. మధ్య మధ్య తనకు కలిగిన సంశయాలను అడిగి, సంశయనివృత్తి చేసుకొంటున్నాడు జనమేజయుడు. వ్యాధి క్రమేణా తగ్గు ముఖం పట్టింది.

మహాభారత కథ పరిసమాప్తమయింది.

జనమేజయుడు లేచి వైశంపాయనునికి పాదాభివందనం చేశాడు.

"దీర్ఘాయుష్మాన్‌భవ" అని దీవించాడు వైశంపాయనుడు మంద స్మిత వదనంతో.

జనమేజయుడు వంచిన నడుం ఎత్తి, బాధపడుతూ తన రెండు చేతులతో తన ఉదర భాగాన్ని అదిమి పట్టుకొన్నాడు.

వైశంపాయనుడు కంగారుపడుతూ, "జనమేజయా! నీ వ్యాధి ఇంకా పూర్తిగా ఉపశమింపలేదా?" అన్నాడు.

"లేదు, గురుదేవా! నాభిప్రదేశంలో కాస్త బాధగా ఉంది—అంతే" అన్నాడు.


"అలాగా...అయితే మహాభారత కథాశ్రవణ సమయంలో నీకు కలిగిన సంశయాన్ని మనసులోనే ఉంచుకొన్నావు. అందుకే ఇలా జరిగింది. వెంటనే తీసివేసిన తెరలను తెప్పించు" అన్నాడు వైశంపాయనుడు.

జనమేజయుని ఆజ్ఞతో పద్దెనిమిది తెరలు తీసుకొని రాబడ్డాయి. ఒక్కొక్క తెరనే తీసుకొని, నిశితంగా పరీక్షిస్తున్నాడు వైశంపాయనుడు. యుద్ధపర్వంనాటి తెర మధ్యలో గచ్చకాయ ప్రమాణమంత నల్లని మచ్చ అలాగే ఉంది. ఆ తెర మీది మచ్చను పరీక్షగా చూస్తూ, "జనమేజయా! కురుక్షేత్ర మహా సంగ్రామంలో మీ తాత భీమ సేనుడు శత్రు సేనలను చీల్చి చెండాడే సన్నివేశాన్ని, నేను నీకు చెపుతున్న సమయంలో, ఏదో సంశయం నీకు కలిగినట్లుంది. అదేదో నిస్సంకోచంగా అడుగు" అన్నాడు వైశంపాయనుడు.

గురుదేవుల వంక ఆశ్చర్యంగా చూశాడు జనమేజయుడు. ఇక దాచి ప్రయోజనం లేదనుకొన్నాడు.

"గురుదేవా! మాతాత భీమ సేనులవారు కురుక్షేత్ర మహా సంగ్రామంలో శత్రు సేనల పైకి ఏనుగులను విసిరివేశాడని, అవి వాయుమండలాన్ని దాటి శూన్యప్రదేశానికి చేరుకొని, భూమ్యాకర్షణ శక్తి కోల్పోయి, అంతరిక్షంలోనే ఉండిపోయాయని చెప్పారు. అది నాకు నమ్మ శక్యం కాలేదు. బహుశా మీరు ఆ విషయాన్ని అతిశయోక్తి అలంకారంలో చెప్పి ఉంటారని సరిపెట్టుకొన్నాను" అన్నాడు జనమేజయుడు.

అందుకు వైశంపాయనుడు చిరునవ్వు నవ్వి, "కాదు, నాయనా! అది అక్షరాలా జరిగిన సంఘటన. నీకు నమ్మకం కలగనిచో నావెంట రా!" అంటూ లేచి అంతఃపురం ప్రక్కనే ఉన్న మైదానం వైపు దారితీశాడు.




జనమేజయుడు గురువుగారిని అనుసరించాడు.

మైదానం చేరుకోగానే వైశంపాయనుడు పద్మాసనం వేసుకొని కూర్చొన్నాడు. జనమేజయుడు ప్రక్కనే నిలబడి ఉన్నాడు.

"నాయనా! జనమేజయా! ఇలా కూర్చో. ఇప్పుడు నీకొక అద్భుతాన్ని చూపిస్తాను. ఇది చూసిన తర్వాతైనా నేను చెప్పినదంతా యథార్థమని అంగీకరిస్తావని ఆశిస్తున్నాను" అన్నాడు వైశంపాయనుడు.

"అలాగే, గురుదేవా!" అంటూ ప్రక్కనే కూర్చొన్నాడు జనమేజయుడు.

వైశంపాయనుడు రెండు కళ్ళు మూసుకొని యోగసమాధిలోకి వెళ్ళిపోయాడు. క్షణాలు గడిచిపోతున్నాయి. ఏం జరుగుతుందోనని ఆత్రతగా ఎదురు చూస్తున్నాడు జనమేజయుడు.

ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. ఆ ప్రదేశమంతా చీకట్లు కమ్ముకున్నాయి. అకాల తిమిరానికి అచ్చెరువొందుతూ పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి. జనమేజయుడు ఆశ్చర్యంతో ఆకసం వంక చూస్తున్నాడు. నల్లని మేఘాలు భూమిని సమీపిస్తున్నాయి. భయకంపితుడై "గురుదేవా! గురుదేవా!" అంటూ పిలిచాడు. వైశంపాయనుడు మాట్లాడలేదు సరికదా, కళ్ళయినా తెరువలేదు.

చూస్తుండగానే అల్లంత దూరంలో మత్తేభాల కళేబరాలు భూమిమీద కుప్పలు కుప్పలుగా కూలసాగాయి. ఆ ఏనుగుల రాశిని చూసి నిశ్చేష్టుడయ్యాడు జనమేజయుడు.

రెండు క్షణాల తర్వాత వైశంపాయనుడు కళ్ళు తెరిచి జనమేజయుని వంక చూస్తూ, "నాయనా, జనమేజయా! అటు చూడు. మీ తాత భీమ సేనుడు అలనాడు కురుక్షేత్ర మహా సంగ్రామంలో రిపు సేనల మీదికి విసిరివేసిన ఏనుగులు. ఇంతకాలం అవి భూమ్యాకర్షణ శక్తికి దూరంగా రోదసిలో ఉండిపోయాయి. అక్కడ ప్రాణవాయువు లేనందున అవి మరణించాయి. నీ సంశయాన్ని తీర్చుటకు నేను 'వాయుస్తంభన' విద్యవల్ల వీటిని భూమిమీదకు రప్పించాను. మీ తాతలు మహాబలవంతులని ఇప్పటికైనా నమ్ముతావా?" అన్నాడు.

జనమేజయుడు గురుదేవుల పాదముల పై పడి, "నా అజ్ఞానాన్ని మన్నించండి, గురుదేవా! మహారాజునన్న గర్వంతో గురుదేవులైన మిమ్ములను, పూజ్యులైన పితామహులను అవమానించాను. అందుకు తగిన ప్రాయశ్చిత్తం జరిగింది. కరుణాకలిత హృదయారవిందులైన మీరు నామీద దయదలంచి పంచమ వేదమైన మహాభారతాన్ని ఆమూలాగ్రంగా విన్పించి, కలిగిన సందేహాలను నివృత్తిచేసి, బ్రహ్మహత్యా పాతకం నుండి విముక్తి ప్రసాదించి భయంకరమైన కుష్ఠు రోగాన్ని ఉపశమింపచేశారు. నా కన్నులకు కప్పిన పొరలను తొలగించి నన్ను ధన్యుణ్ణి చేశారు. కర్మఫలాన్ని ఎంతటి వారైనా అనుభవింపక తప్పదనే సత్యాన్ని తెలుసుకొన్నాను. మీమేలు ఎన్నటికీ మరువజాలను. నన్నాశీర్వదించండి" అన్నాడు.

వైశంపాయనుడు ప్రేమతో జనమేజయుణ్ణి లేవనెత్తి మంద స్మిత వదనంతో, "నాయనా! ఇందులో నీ తప్పేమీ లేదు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన ఆ సర్వేశ్వరుడు ఆడించే నాటకంలో మనం కేవలం పాత్రధారులం మాత్రమే. మీ నడవడి, ధర్మప్రవర్తన, కీర్తిప్రతిష్ఠలు, శౌర్యప్రతాపాలు భావితరాల వారికి ధ్రువతారలై ప్రకాశించుగాక!" అని ఆశీర్వదించాడు వైశంపాయనుడు. ★